# సింగరేణి బొగ్గు.. నాణ్యతతోనే నెగ్గు

**నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ముందుకు**

- దక్షిణ భారతంలోనే అగ్రగామి సంస్థ..
- సింగరేణి వ్యాప్తంగా నాణ్యతా వారోత్సవాలు
- నేటితో ముగియనున్న కార్యక్రమాలు
- 9వ తేదీ నుంచి ఓసీపీలు, గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద అవగాహన సదస్సులు

**సింగరేణి యాజమాన్యం..** నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ముందుకుసాగుతున్నది. 130 ఏండ్ల ఘనమైన చరిత్ర కలిగిన కోల్‌బెల్ట్.. విద్యుత్ ఉత్పాదన సంస్థలకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తూ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచింది. దేశ ఆర్థిక ప్రగతిలో సుస్థిర స్థానం సంపాధించింది. పోటీ మార్కెట్‌లో ఇతర సంస్థలకు దీటుగా నాణ్యతా ప్రమాణాలను పెంచుకుంటూ మనుగడ కాపాడుకుంటున్నది. ఇందులో భాగంగా యేటా బొగ్గు నాణ్యతా వారోత్సవాలు జరుపుతుండగా, ఈ ఏడాది 'మార్కెట్‌లో మన బొగ్గు-నాణ్యతతోనే నెగ్గు' అనే నినాదంతో సంస్థ వ్యాప్తంగా నిర్వహించింది. కాగా, నేటితో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. **- కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 14**



బొగ్గు నాణ్యత వారోత్సవాల ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

'నాణ్యత మా బాధ్యత-వినియోగదారుడి సంతృప్తియే మా ప్రాధాన్యత.., నాసిరకం బొగ్గు వద్దు-నాణ్యమైన బొగ్గు ముద్దు.., షేల్ మరియు బండలు ఏరేద్దాం-బొగ్గు నాణ్యతను పెంచేద్దాం.., నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేద్దాం-కంపెనీ ప్రాధాన్యతను పెంచుదాం.., బొగ్గు ఉత్పత్తి మా వృత్తి-నాణ్యత మా ప్రవృత్తి..' అనే నినాదాలతో సింగరేణి యాజమాన్యం నవంబర్ 9వ తేదీన బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ప్రారంభించింది. ఈ వారోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. ఈ ఏడాది 'మార్కెట్‌లో మన బొగ్గు-నాణ్యతతోనే నెగ్గు'.., నాణ్యతే ప్రగతికి ప్రామాణికం-దాని పరిరక్షణే అందరి బాధ్యత..' అంటూ సంస్థ వ్యాప్తంగా బొగ్గు నాణ్యతపై అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించింది. సింగరేణి వ్యాప్తంగా ఓసీలు, బొగ్గు గనులు, వివిధ డిపార్ట్‌మెంట్ల వద్ద బొగ్గు నాణ్యతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. అవగాహన కల్పించింది. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడంలో ప్రతీ సింగరేణీయుడు తనవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపింది. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడంపై వినియోగదారులు సంపూర్ణ విశ్వాసాన్ని పొందడం ద్వారా సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని వివరించింది.

### ❖ అనుసరిస్తున్న నియమాలు..

- యేటా బొగ్గు డిక్లరేషన్‌లో ఇచ్చిన సీమ్ సెక్షన్‌ను మాత్రమే బొగ్గు ఉత్పత్తికి వాడుకోవడం.
- ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు పొరలకు డ్రిల్లింగ్ చేసేందుకు ముందు దానిపై మట్టి, రాళ్లు లేకుండా డోజర్ సాయంతో శుభ్రం చేయడం.
- బొగ్గు పొరలపై బొగ్గు పొరల మధ్యలో వచ్చే బండ, మట్టి పొరలను షావెల్‌తో లోడింగ్ చేసే వారు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించి, మంచి బొగ్గును నింపడం ఎంతైనా అవసరం.
- డే లైటింగ్ ప్రాజెక్టుల్లో గ్యాలరీలను ముందుగా శుభ్రం చేసిన తర్వాతనే బ్లాస్టింగ్ చేయడం.
- భూగర్భగనుల్లో పనిచేసే ప్రతీ కార్మికుడు లోడింగ్ స్థలంలో అప్రమత్తంగా ఉండి, బండను బొగ్గును వేరు చేసి, బొగ్గును మాత్రమే టబ్బుల్లో నింపడం.
- ఎస్‌డీఎల్ యంత్రాలతో బొగ్గు లోడింగ్ సమయంలో బండలు, మట్టిని వేరు చేసి, బొగ్గును మాత్రమే టబ్బుల్లో నింపే జాగ్రత్తలు తీసుకోవాలి.
- సీహెచ్‌పీల్లో బెల్టుపై బండ, షేల్ వేరు దగ్గర నిరంతరం పర్యవేక్షణ చేస్తూ బండ, షేల్‌ను తొలగించేందుకు కృషి చేయడం. బండ, షేల్ లేని బొగ్గు సరఫరా చేసేందుకు సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు క్రియాశీలకంగా వ్యవహరించడం.

### ఘనమైన చరిత్ర.. ఘనమైన ఉత్పత్తి..

సింగరేణి సంస్థ 130 ఏండ్లుగా విద్యుత్ ఉత్పాదన సంస్థలకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తూ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా నిలిచింది. మన దేశ ఆర్థిక ప్రగతిలో సుస్థిర స్థానం సంపాధించుకున్నది. ప్రస్తుత తీవ్రమైన పోటీ ఉన్న మార్కెట్‌లో ఇతర సంస్థలకు దీటుగా బొగ్గు నాణ్యతా ప్రమాణాలను పెంచుకుంటూ సంస్థ తన మనుగడ కాపాడుకుంటున్నది. ప్రస్తుతం సింగరేణిలో నాణ్యమైన బొగ్గు సరఫరా చేసేందుకు రెండు సర్ఫేస్ మైనర్‌లను వాడుతున్నారు. ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓసీ-2లో ఒకటి, మణుగూరు పీకే ఓసీ-4లో మరో మైన్ ఉన్నది. సాంకేతిక పరిజ్ఞానం వల్ల తక్కువ మందం కలిగిన వివిధ గ్రేడ్‌ల బొగ్గును తీయడం వల్ల బొగ్గు నాణ్యత తగ్గకుండా ఉంటుంది.

### బొగ్గు నాణ్యతకు జాగ్రత్తలు..

నిరంతర నాణ్యత పర్యవేక్షణ కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాలను అనుసరించి ఆన్‌లైన్ యాష్ మానిటర్, ఆష్ ప్రొబ్, ఆగర్ సాంప్లర్ లాంటి అధునాతన పరికరాలను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బొగ్గు సరఫరాలో కనీసం 85 శాతం గ్రేడ్ సాటిస్‌ఫాక్చన్ సాధించేందుకు మన సీహెచ్‌పీలు, మైన్లను మూడు కేటగిరీలుగా నిర్ణయించారు. 85 శాతం పైగా గ్రేడ్ సాటిస్‌ఫాక్షన్ ఉన్న మైన్లు, సీహెచ్‌పీలు, ఏ కేటగిరి గాను, 50-85 శాతం మధ్య గ్రేడ్ సాటిస్‌ఫాక్షన్ ఉంటే బీ కేటగిరీగాను, 50 శాతం కంటే తక్కువ గ్రేడ్ సాటిస్‌ఫాక్షన్ ఉన్న మైన్లు, సీహెచ్‌పీలను సీ కేటగిరీగాను నిర్ణయించింది. సీ అండ్ బీ కేటగిరీల మైన్‌లు, సీహెచ్‌పీల మీద దృష్టిపెట్టి, వాటిని ఏ కేటగిరీలోకి తీసుకువచ్చేందుకు కలిసి కట్టుగా ప్రయత్నం చేస్తున్నారు.



సింగరేణి వ్యాప్తంగా గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేసిన బొగ్గు నాణ్యత వారోత్సవాల పోస్టర్లు


ఎస్సార్పీ-1 గనిపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి, చిత్రంలో మంచిర్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

## కేసీఆరే.. సింగరేణికి రక్ష

- గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటున్నరు
- ఐటీ రద్దుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపిన్రు..
- కేంద్రంలో ఐటీ రద్దు చేసే ప్రభుత్వానికే మద్దతు
- మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్, నవంబర్ 14 : సింగరేణికి సీఎం కేసీఆరే రక్ష అని, గనులు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటున్నారని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ ఎస్సార్పీ-1 గనిపై మంగళవారం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డితో కలిసి దివాకర్‌రావు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను(ఐటీ) రద్దు చేయాలని తీర్మానం చేసి, కేంద్రానికి పంపించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఐటీ రద్దు చేయడం లేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ తిరిగి హ్యాట్రిక్ సాధించి, ముఖ్యమంత్రి అయితే, రానున్న పార్లమెంట్ ఎన్నికల అనంతరం కార్మికులకు ఐటీ రద్దు చేసే పార్టీకి మాత్రమే మద్దతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ వస్తే తెలంగాణ సింగరేణి గనులు ప్రైవేటీకరణ చేస్తారని అన్నారు. గనులు ప్రైవేటీకరణ కాకుండా కేసీఆర్ అడ్డుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ రావడానికి ముఖ్య భూమిక పోషించిన కార్మికులకు కానుకగా కేసీఆర్ కారుణ్య ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. కార్మికులకు 32 శాతం లాభాల వాటా ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాలతో కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపారని చెప్పారు. దీంతో 16 వేల మందికి ఉద్యోగాలు దొరికి, నేడు 43 వేల మందితో సింగరేణి కళకళలాడుతున్నదన్నారు. కారుణ్యం ఇచ్చిన కేసీఆర్‌కు కార్మికులు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణా హ్యాట్రిక్ ప్రభుత్వం రాగానే, కార్మికులకు అలవెన్స్‌లపై ఐటీ రద్దు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, కార్మికులకు ఆర్థిక లాభాలు కల్పిస్తున్నారని చెప్పారు. కార్మికులు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, మల్లారెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, కాశీరావు, బ్రాంచ్ కార్యదర్శి గడ్డం మహిపాల్‌రెడ్డి, కానగంటి చంద్రయ్య, ఏరియా కార్యదర్శి తొంగల రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, రౌతు సత్యనారాయణ, పిట్ కార్యదర్శి తిరుపతి, నాయకులు సతీశ్, భాస్కర్, తిరుపతిరావు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వసతులు కల్పించాలి

దండేపల్లి, నవంబర్ 14 : దండేపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బిశ్వజిత్ దత్త పేర్కొన్నారు. గూడెం చెక్‌పోస్ట్‌తో పాటు దండేపల్లి, కుందేళ్ల పహాడ్ పోలింగ్ కేంద్రాల మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన వెంట ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## వివేక్‌తో తీవ్ర అన్యాయం

- ఓడించి ఇంటికి పంపిస్తాం
- బీజేపీకి రాజీనామా చేసిన అందుగుల శ్రీనివాస్

చెన్నూర్, నవంబర్ 14 : పూటకో పార్టీ మార్చే చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి వల్ల బీజేపీలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందుకే తాము పార్టీకి రాజీనామా చేస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు జాడి ఏసయ్య, మందమర్రి పట్టణాధ్యక్షుడు సప్పిడి నరేశ్, నాయకుడు కోల శ్రీనివాస్ అన్నారు. చెన్నూర్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ రాజీనామా పత్రాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి మెస్సేజ్ రూపంలో పంపించామని తెలిపారు. బీజేపీని సర్వనాసనం చేసేందుకు పథకం ప్రకారం పార్టీని నమ్ముకున్న కార్యకర్తలందరికీ వెన్నుపోటు పొడిచిన వివేక్‌ను చెన్నూర్ నియోజకవర్గంలో ఎట్టి పరిస్థితుల్లో గెలువనీయబోమని స్పష్టం చేశారు. ఓడగొట్టి ఇంటికి పంపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గంలోని గ్రామ గ్రామానా, ఇంటింటికీ వెళ్లి తమను వివేక్ ఎలా మోసం చేశారో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. నమ్ముకున్న కార్యకర్తలకే ఏమీ చేయలేని వివేక్, చెన్నూర్ ప్రజలకు ఏం చేస్తాడని ప్రశ్నించారు. పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో వంద కోట్ల డీల్ చేసుకొని కాంగ్రెస్‌లో చేరాడని విమర్శించారు. ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.